సాక్షి మంచిర్యాల

బుధవారం, 14, ఫిబ్రవరి, 2024

డీఆర్‌డీవో బాధ్యతల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: డీఆర్‌డీవోగా కిషన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ సంతోష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల బదిలీల ప్రక్రియలో భాగంగా ఇక్కడ పని చేసిన బి.శేషాద్రి రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఆదిలాబాద్ నుంచి బదిలీపై వచ్చారు.

పౌష్టికాహారం అందించాలి

భీమారం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలికలకు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ బి.సంతోష్ ఆదేశించారు. మంగళవారం జైపూర్ మండలం దుబ్బపల్లి, జైపూర్–1 అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. కలెక్టర్ పిల్లల ఎత్తు, బరువు నమోదు చేయాలని అన్నారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, అదనపు సీడీపీవో హేమసత్య పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
33.0 /20.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అధికారుల బదిలీలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏసీపీ, మున్సిపల్ కమిషనర్‌తోపాటు పలువురు అధికారులు బదిలీ అయ్యారు. బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్యను బదిలీ చేస్తూ డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని డీజీపీ రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో రాజన్న సిరిసిల్ల ఎస్‌బీ విభాగంలో డీఎస్పీగా పని చేస్తున్న ఏ.రవికుమార్‌ను నియమించారు. ఈయన గతంలో బెల్లంపల్లి టూటౌన్ ఎస్సైగా పని చేశారు. బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ ఆర్.భుజంగరావు ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. భుజంగరావు స్థానంలో నారాయణఖేడ్ మున్సిపల్ కమిషనర్ జి.మల్లారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. బెల్లంపల్లి ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ డి.దీపక్‌ను ఆసిఫాబాద్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో తిమ్మాపూర్ ఎస్‌హెచ్‌ఓ జే.ఇంద్రప్రసాద్‌ను నియామకం చేశారు.

మున్సిపల్ కమిషనర్..

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణను బోధన్ మున్సిపాలిటీకి బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

తహసీల్దార్ల బదిలీ

మంచిర్యాలఅగ్రికల్చర్: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. జిల్లాలో పని చేస్తున్న 11మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ బదావత్ సంతోష్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మంచిర్యాల తహసీల్దార్ కేవై.ప్రసాద్‌ను బెల్లంపల్లికి, నెన్నెల తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌ను తాండూర్‌కు, జన్నారం తహసీల్దార్ కే.వేణుగోపాల్‌ను మంచిర్యాల ఆర్డీవో కార్యాలయానికి, బెల్లంపల్లి తహసీల్దార్ బి.సుధాకర్‌ను బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయానికి, నస్పూర్ తహసీల్దార్ కే.వనజారెడ్డిని జైపూర్‌కు, వేమనపల్లి తహసీల్దార్ ఎం.సదానందంను భీమారానికి, జైపూర్ తహసీల్దార్ కే.రమేష్‌ను వేమనపల్లికి బదిలీ చేశారు. కుమురంభీం జిల్లా నుంచి ఎస్.రమేష్ నెన్నెలకు, కే.రమేష్ మంచిర్యాలకు, జగిత్యాల జిల్లా నుంచి సి.రాజమనోహర్‌రెడ్డి జన్నారానికి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి పి.శ్రీనివాస్ నస్పూర్‌కు బదిలీ అయ్యారు.

నిర్లక్ష్యం వహిస్తే క్రిమినల్ కేసు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని రైస్‌మిల్లులకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యం వహిస్తే క్రిమినల్ కేసు నమోదుతోపాటు మిల్లు సీజ్ చేస్తామని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ హెచ్చరించారు. మంగళవారం అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్, రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2022–23 వానాకాలం, యాసంగి సీజన్ ధాన్యం కేటాయింపు, సీఎంఆర్ వివరాలు వెల్లడించారు. నెలాఖరులోగా సీఎంఆర్ పూర్తి చేయని రైస్‌మిల్లర్లపై చర్యలతోపాటు వారికి కేటాయించిన ధాన్యాన్ని వేరే మిల్లులకు కేటాయిస్తామని అన్నారు.

ఒకరినొకరు అర్థం చేసుకోవాలి



- ప్రేమ–పెళ్లి అంశంపై విద్యార్థుల మనోగతం
- ప్రేమపెళ్లికి కొందరు.. పెద్దలు కుదిర్చిన పెళ్లికి మరికొందరు జై..
- 'సాక్షి' టాక్‌షోలో వివేకవర్ధిని డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు
- ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేకం



టాక్ షోలో పాల్గొన్న వీవీడీసీ విద్యార్థులు

మంచిర్యాలటౌన్: ప్రేమ.. పెళ్లి రెండక్షరాలు. ఒక తరం ఇద్దరి జీవితాలు.. తొలి చూపులోనే ప్రేమలో పడేవారు కొందరైతే.. వలపు వలలో పడి మోసపోయేవారు మరికొందరు. చదువుకునే వయస్సులో ప్రేమ పేరిట చదువును పక్కన పెట్టేసి ఆశలను వమ్ము చేస్తున్న వారిపై తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొనగా.. ప్రేమను గెలిపించుకునేందుకు జీవితంలో ఉన్నతంగా ఎదిగి స్థిరపడిన తర్వాత పెళ్లి చేసుకుంటున్న ప్రేమికులూ ఉన్నారు. ఈ నెల 14 ప్రేమికుల దినోత్సవం సందర్భంగా మారుతున్న యువ'తరం' ఎటువైపు ప్రేమ పెళ్లినా.. పెద్దలు కుదిర్చిన పెళ్లినా..! అనే అంశంపై మంచిర్యాలలోని వివేకవర్ధిని డిగ్రీ, పీజీ కళాశాలలో 'సాక్షి' ఆధ్వర్యంలో మంగళవారం టాక్‌షో నిర్వహించింది. కొందరు ప్రేమపెళ్లికి.. మరికొందరు పెద్దలు కుదిర్చిన పెళ్లికి జై కొట్టారు. ఇంకొందరు ఏ పెళ్లి చేసుకున్నా ఇద్దరి మధ్యలో ఒకరిపైనొకరికి పూర్తి నమ్మకం, అవగాహన ఉండాలని, ఒకరినొకరు అర్థం చేసుకోవాలని అప్పుడే ఆ జంట జీవితాంతం కలిసి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమైంది.

అనుమానం ఉండవద్దు



ప్రేమ పెళ్లి చేసుకున్నా, పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకున్నా ఇద్దరి మధ్య ఎలాంటి అనుమానాలు ఉండవద్దు. అనుమానం ఉంటే ఎంత కలిసి ఉండాలనుకున్నా ఆ బంధం ఎక్కువ రోజులు నిలువదు. అందుకే ఏ పెళ్లి చేసుకున్నా ఇద్దరి అభిప్రాయాలు కలవాలి. ఒకరినొకరు అర్థం చేసుకోవాలి.

–సీహెచ్.రమ్య, ఎంపీసీఎస్, డిగ్రీ సెకండియర్

ప్రేమ పెళ్లి మంచిది



ప్రేమ పెళ్లి మంచిది. కాని లవ్ ఎట్ ఫస్ట్‌సైట్ అనేది కూడా కరెక్టు కాదు. లవ్ మ్యారేజ్‌లో ఇద్దరి అభిప్రాయాలు ఒకరినొకరు తెలుసుకునేందుకు వీలుంటుంది. ఇద్దరు ఒకరినొకరు అందం చూసో, డబ్బు చూసో ప్రేమించుకుంటే అది నిలువదు. అలాగే పెద్దలు కుదిర్చిన పెళ్లిలో ఒకరినొకరు అర్థం చేసుకోకుంటే కష్టమే.

– ఎస్.వినయ్, బీటీజీ థర్డ్ ఇయర్

పెద్దల నిర్ణయంతోనే పెళ్లి



పెద్దలు చూసిన పెళ్లితోనే జీవితం బాగుంటుంది. ప్రేమ పెళ్లయినా, పెద్దల పెళ్లయినా చేసుకునే వారు అర్థం చేసుకోవాలి. లవ్ మ్యారేజ్‌లో ప్రేమ ఉన్నా, ఆ తర్వాత ఇద్దరి మధ్య మనస్పర్థలు రానంత వరకు ఏమీ కాదు. ఒకవేళ వస్తే ఇబ్బందిగా మారుతుంది. ఏ పెళ్లి చేసుకున్నా, ఇద్దరి మధ్య ఒకరిపై ఒకరికి అవగాహన ఉండాలి.

– ఎం.సాయితేజ, డిగ్రీ ఫస్టియర్

అరేంజ్‌డ్ మ్యారేజ్ బెస్ట్



అరేంజ్‌డ్ మ్యారేజ్ చేసుకుంటేనే మంచిది. ఇరువైపులా తల్లిదండ్రులు అన్ని విధాలుగా అండగా ఉండి, ఏ తప్పులు చేసినా సరిదిద్దుతారు. ఏవైనా గొడవలు జరిగినా వారు కలుగజేసుకుని తిరిగి వారిని కలిపేందుకు అవకాశం ఉంటుంది.

– ఏ.వికాస్, బీకాం ఫస్టియర్

అవగాహన ఉండాలి



ప్రేమ పెళ్లి, పెద్దల కుదుర్చిన పెళ్లి ఏదైనా సరే పెళ్లి తర్వాత ఒకరినొకరు గౌరవించుకోవాలి. ఇద్దరి మధ్య అవగాహన ఉండాలి. లేదంటే పెళ్లి తర్వాత పిల్లలు, బాధ్యతలతో తరచూ ఏదో ఒక గొడవ జరిగే అవకాశాలు ప్రతి ఇంట్లోనూ ఉంటాయి. అర్థం చేసుకునే దానిపైనే ఆ బంధం ఎంత మేర నిలబడుతుందో తెలుస్తుంది. మా కుటుంబం ఇప్పటికీ ఉమ్మడిగా ఉండేందుకు కారణం అర్థం చేసుకోవడమే.

– పి.అక్షయ, ఎంఎస్‌టీసీఎస్, డిగ్రీ సెకండియర్

స్టేటస్ కోసం ప్రేమించొద్దు



ఈ రోజుల్లో పక్కన ఉన్న వారికి లవర్ ఉందని, నాకు ఒక లవర్ కావాలనే వారు ఎక్కువ అవుతున్నారు. అలాంటి వారు లవ్ చేసుకుంటే జీవితాంతం కలిసి ఉండరు. ప్రేమ పెళ్లి, పెద్దలు కుదిర్చిన పెళ్లిలో ఎవరు మనకు బెస్ట్ అనేది మనమే ఆలోచించుకోవాలి. ఏదో స్టేటస్ కోసం ప్రేమించిన వారు పెళ్లి చేసుకుంటే కలిసి ఉండలేరు. పెద్దలు చెప్పినట్లుగా వింటే బాగుంటుంది.

– పి.వర్ష, బీకాం ఫస్టియర్

పెద్దల పెళ్లికే నా మద్దతు



నేను ప్రేమ పెళ్లికి సపోర్టు చేయను. లవ్ మ్యారేజ్‌లో జాబ్ వచ్చిందని ఇంట్లో నుంచి వెళ్లిపోయి పెళ్లి చేసుకుంటారు. కొన్ని రోజుల తర్వాత వీరు ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంట్లో పెద్దలు బాధతో కుమిలిపోయి ఉంటారు. వారు సొసైటీలో మీ అబ్బాయి ఇలా, మీ అమ్మాయి అలా అని మాట్లాడుకోవడాన్ని తట్టుకోలేక వారు ఉండవచ్చు, ఉండకపోవచ్చు. పెళ్లి తర్వాత తిరిగి వచ్చినా జీవితాంతం ఆ బాధ వెంటాడుతది.

– శ్రీలత, బీకాం ఫస్టియర్

రెండు హృదయాల కలయిక.. ప్రేమ

ప్రేమ.. లవ్.. ఇష్క్.. అక్షరాలు రెండే అయినా రెండు జీవితాలను మూడు ముళ్లు.. ఏడడుగుల వైపు నడిపించే బంధం. ఎవరిలో ఎప్పుడు ప్రేమ చిగురిస్తుందో గానీ కొన్ని ప్రేమకథలు విజయవంతంగా 'ముడి' పడుతుండగా.. మరికొన్ని విడిపోయి విషాదంగా మిగులుతున్నాయి. సక్సెస్ సాధించిన జంటలపై ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు..

చిన్ననాటి బంధం!

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా జైపూర్‌కు చెందిన సౌమ్య, మల్లేశ్ చిన్నప్పటి నుంచి ఏడో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. ఆ తర్వాత బడులు వేరయ్యాయి. మళ్లీ కొన్నేళ్ల తర్వాత మంచిర్యాలలోని ప్రభుత్వ కళాశాలలో చదువుతుండగా వారి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. కులాలు వేరు కావడంతో పెళ్లికి పెద్దలు నిరాకరించారు. దీంతో ఇంట్లో నుంచి వెళ్లి 2007 అక్టోబర్ 22న బెంగళూర్ ఆర్కేపురంలోని గణేష్ మందిరంలో పెళ్లి చేసుకున్నారు. హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో పని చేసిన మల్లేశ్ తన చిన్ననాటి నుంచి పోలీస్ కావాలనే కలను సాకారం చేసుకోవడానికి తిరిగొచ్చారు. సౌమ్య ప్రోత్సాహంతో సీఆర్‌పీఎఫ్‌లో ఉద్యోగం సాధించాడు. జార్ఖండ్, మధ్యప్రదేశ్, అస్సాంలో పని చేశాడు. ప్రస్తుతం మణిపూర్‌లో కమాండోగా పని చేస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఖుషీ, ర్యాంసీ ఉన్నారు.

- మరిన్ని కథనాలు 8లో▸



మణిపూర్‌లో పిల్లలతో సౌమ్య, మల్లేశ్

ఇదేమీ.. వెంకటేశా?

- ఎంపీ ల్యాడ్స్ పనుల్లో 'నామినేషన్ల' పర్వం
- అర్హత లేకున్నా తమవారికే రూ.2.87కోట్లు అప్పగింత
- మేకల ఫాంకు వెళ్లేదారికి రూ.5లక్షలకు అనుమతి
- పనులు సైతం తన, మన అనుకున్న చోటే..



ఈ ఫొటోలో కనిపిస్తున్న మట్టి రోడ్డు కన్నెపల్లి మండలం జన్కాపూర్‌లో పొనుగోటి శ్రీనివాసరావుకు చెందిన మేకల ఫాంకు వెళ్లే దారి. ఇక్కడ సీసీ రోడ్డు వేసేందుకు ఎంపీ ల్యాడ్స్ కింద రూ.5లక్షలు ఖర్చు చేసేలా పరిపాలన అనుమతులు వచ్చాయి. ఈ రోడ్డుకు ప్రధానంగా శ్రీనివాసరావు ఫాంహౌజ్, ఆయన సంబంధీకుల పంట చేనులే ఉన్నాయి. సామాజిక ప్రయోజనం తక్కువే. మరోవైపు శ్రీనివాసరావుకే చెందిన ఎంపీ ల్యాడ్స్ కింద జిల్లాలో పలు చోట్ల రూ.14లక్షలతో బోర్‌వెల్, పంపుసెట్లు వేసేందుకు నామినేషన్ పద్ధతిన అప్పగించాలని పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత సిఫారసు చేశారు. తమ అనుకూలమైన వారికి మేలు చేసేందుకు ఎంపీ ప్రజాధనాన్ని ఎలా వినియోగిస్తున్నారో చెప్పేందుకు ఇదే నిదర్శనం.

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎంపీ ల్యాడ్స్(మెంబర్ ఆఫ్ పార్లమెంటు లోక్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీం)ను పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత పలహారం పంచినట్లు తమ వారికి పంచి పెడుతున్నారు. తన అనుకునే వారికి నామినేషన్ పద్ధతిన రూ.2.87కోట్ల నిధులు అప్పగించారు. రూ.5లక్షలలోపు పనులను ఎలాంటి టెండర్లు లేకుండానే ఇచ్చే వెసులుబాటు ఉండంతో కావాల్సిన వారికి నచ్చినట్లుగా ఇచ్చేశారు. ఇందుకోసం ప్రతీ పనిని రూ.5లక్షలకే పరిమితం చేశారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ పరిధిలో మొత్తంగా 103 పనులను బిట్లుగా విభజించి, రూ.2.87కోట్ల నిధులు అప్పగించారు. ఇందులో ఎంపీ అనుచరులే ఉండడం గమనార్హం. ఈ పనులన్నింటినీ కమీషన్ ప్రాతిపదికన ఇచ్చారని ఆరోపణలు చేస్తున్న వారూ ఉన్నారు. ప్రతీ పార్లమెంట్ సభ్యుడికి కేంద్రం ఏటా రూ.5కోట్లు నియోజకవర్గ అభివృద్ధికి కేటాయిస్తుంది. కోవిడ్ కాలం తప్ప మిగతా కాలానికి యథావిధిగా నిధులు వస్తున్నాయి. పెద్దపల్లి లోక్‌సభ పరిధిలో ఈ నిధులే ఖర్చు చేసేందుకు ఎంపీ తన పదవీ కాలం పూర్తయ్యే ముందు ఇలా వాడుతున్నారు.

అర్హత లేకున్నా బోర్లు, పంపుసెట్లు

గ్రామాల్లో నీటి ఎద్దడి తీర్చేందుకు పంపుసెట్లతో కూడిన బోర్‌వెల్ వేసేందుకు ఎంపీ జిల్లా కలెక్టర్ నుంచి పరిపాలన అనుమతులు పొందారు. గతంలో బోర్లు వేసిన అనుభవంగానీ, రిజిస్టర్ గానీ లేకున్నా తన దగ్గరి వ్యక్తికే ఈ పనులు అప్పగించారు. కన్నెపల్లి మండలం జన్కాపూర్‌తో సంబంధాలు ఉన్న జగిత్యాల జిల్లా వెల్గటూరు మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాసరావును హ్యాబీటేషన్ వర్క్స్ కమిటీ చైర్మన్‌గా నియమించి పనులు కట్టబెట్టారు. జైపూర్ మండలం వేలాలలో ఒకటి, శివ్వారంలో మూడు, చెన్నూరు మండలం నాగాపూర్ మూడు, కన్నెపల్లి మండలం జన్కాపూర్‌లో ఓ బోర్‌వెల్, ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు అనుమతులు పొందారు. ప్రతీ బోర్‌వెల్ పంపుసెట్‌కు రూ.2లక్షల చొప్పున, ఆర్వో ప్లాంట్‌కు రూ.5లక్షల చొప్పున మొత్తంగా రూ.రూ.14లక్షలు వెచ్చించనున్నారు. గత ప్రభుత్వం రూ.కోట్లు కుమ్మరించిన 'మిషన్ భగీరథ' కింద తాగునీరు అందక ఈ బోర్లు వేయడం గమనార్హం.

పరిపాలన అనుమతులు వచ్చాయి

ఎంపీ ప్రతిపాదనలు పంపిన మేరకే సీసీ రోడ్డు, డ్రెయిన్స్ నిర్మాణం కోసం పరిపాలన అనుమతులు వచ్చాయి. సీసీ రోడ్డు పంట చేన్లు, పొలాలు, ఇతర వాటికి కూడా ప్రతిపాదనలు పంపుతున్నారు. కన్నెపల్లి మండలం జన్కాపూర్‌లో సీసీ రోడ్డుపై పరిశీలన చేస్తాం.

–ఎం.స్వామిరెడ్డి, ఈఈ, పంచాయతీరాజ్

మండలానికొకరికి అప్పగింత

పంచాయతీరాజ్ పరిధిలో భీమారం మండల కేంద్రం, కన్నెపల్లి మండలం జన్కాపూర్, గొల్లగట్టు, తాండూరు మండలం అచలాపూర్, మందమర్రి మండలం చిర్రకుంట, పొన్నారం, అందుగులపేట, సారంగపల్లి, మామిడిగట్టు, కోటపల్లి మండల కేంద్రం, శంకరాపూర్, శెట్‌పల్లి, సర్వాయిపేట, ఇసన్వాయి, చెన్నూరు మండలం నాగాపూర్, జైపూర్ మండలం ఇందారంలో హైమాస్ట్ లైట్లు, సైడ్‌డ్రైన్స్(కాలువలు) నిర్మించేందుకు రూ.2.66కోట్లు ఖర్చు చేస్తున్నారు. మండలానికి ఒకరు తమకు అనుకూల వారికి బిట్లుగా చేసి అప్పగించారు. మందమర్రితో పాటు కొన్ని చోట్ల హైమాస్ట్ లైట్లు బిగిస్తున్నారు. సీసీ రోడ్డు పనులు ప్రారంభం కావాల్సి ఉంది.



శ్రీనివాసరావుకు పంపు సెట్లు, బోర్‌పనులు చేసేందుకు అగ్రిమెంట్ చేయాలని ఎంపీ వెంకటేశ్ నేత ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈకి పంపిన లేఖ

అనుమతులు ఎలా ఇచ్చారో..

ఎంపీ ల్యాడ్స్ ఖర్చు చేయాలంటే జిల్లా కలెక్టర్ కీలకం. ఎంపీ ప్రతిపాదిస్తే నిశితంగా పరిశీలన చేసి ప్రజోపయోగం ఉందా? లేదా? సంబంధిత శాఖతో పూర్తి స్థాయిలో పరిశీలించాకే అనుమతులు ఇవ్వాలి. అయితే ఎంపీ ప్రతిపాదించిన ప్రతీ పనిని ఆమోదించారు. గ్రామసభలు నామమాత్రంగా నిర్వహించి, పనులు కట్టబెట్టారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇక హైమాస్ట్ లైట్ల కొనుగోళ్లలోనూ భారీగా అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

జేఈఈ మెయిన్స్‌లో సీఓఈ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) మంగళవారం జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాలు ప్రకటించగా.. ఏకంగా ఎనిమిది మంది ఉత్తమ పర్సంటైల్ సాధించారు. దుర్గం చరణ్‌తేజ్ 85.04 పర్సంటైల్‌తో కళాశాల టాపర్‌గా నిలువగా.. తీగల అక్షిత్ 83.64, దుర్గం అభిరానందన్ 75.50, లింగంపల్లి అంజి 63.39, ఆకుతోట శివసాయి 58.17, కామెర విష్ణుచైతన్య 55.16, పుట్టల శివ 54.92, కొందుకూరి దిలీప్ 50.11 పర్సంటైల్ సాధించినట్లు సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. వీరితోపాటు మరో ఐదుగురు విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. ఏప్రిల్‌లో జేఈఈ రెండో విడత పరీక్ష నిర్వహిస్తారు. ఈ రెండింటిలో ఫలితాన్ని బట్టి అడ్వాన్స్‌డ్‌కు అర్హత ఇస్తారు. విద్యార్థులను ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కో ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి, ప్రిన్సిపాల్ సైదులు, సూపరింటెండెంట్ అవధూత రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ కోటరాజ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

క్లుప్తంగా

వాహనం ఢీకొని చుక్కల దుప్పి మృతి

జన్నారం: రోడ్డు దాటే క్రమంలో వాహనానికి ఢీకొని చుక్కల దుప్పి మృతి చెందింది. జన్నారం రేంజ్ పరిధిలోని పైడిపెల్లి ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో మంగళవారం చుక్కల దుప్పి వేగంగా రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు అటవీ బీట్ అధికారులు రహీమొద్దీన్, శ్రీనివాస్, బానయ్య సంఘటన స్థలానికి వెళ్లి పశువైద్యాధికారి శ్రీకాంత్‌తో చికిత్స చేయించారు. అనంతరం జింకల పునరావాస కేంద్రంలో వదిలేసిన కొంతసేపటికే మృతి చెందినట్లు రేంజ్ అధికారి హఫీజొద్దీన్ తెలిపారు. పంచనామా నిర్వహించి జింకల పార్కు సమీపంలో ఖననం చేశారు.

ఫోర్జరీ కేసు నమోదు

దహెగాం: మండలంలోని బొర్లకుంటకు చెందిన సోలులే లక్ష్మణ్‌పై మంగళవారం ఫోర్జరీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. లక్ష్మణ్ తన ఇంటి రిజిస్ట్రేషన్ కోసం పంచాయతీ ముద్ర తయారు చేసుకుని కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసి ధ్రువీకరణపత్రం తయారు చేసుకుని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాడు. అధికారులకు అనుమానం రావడంతో బొర్లకుంట పంచాయతీ కార్యదర్శి సౌమ్యకు ఫోన్ చేయడంతో పంచాయతీ నుంచి ఎలాంటి ధ్రువీకరణ పత్రం జారీ చేయలేదన్నారు. పంచాయతీ కార్యదర్శి సౌమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మణ్‌పై ఫోర్జరీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జన్నారం మార్కెట్ కమిటీ పాలకవర్గం రద్దు

జన్నారం: జన్నారం మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రభుత్వం రద్దు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు మార్కెట్ కార్యదర్శి గద్దల శ్రీనివాస్ తెలిపారు. 2022 ఆగస్టు 8న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కమిటీ అధ్యక్షులుగా సీపతి పద్మ, సభ్యులుగా భరత్‌కుమార్, అన్నె కాంతమణి, రజాక్, హరీష్‌గౌడ్, వెంకటేశ్, భాస్కర్, భరత్ నాయక్, నర్సాగౌడ్, సంతోష్‌కుమార్, రాయమల్లు, శ్రీనివాస్, సునీతను నియమించింది. రెండేళ్ల పదవీకాలం పూర్తి కాకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీని రద్దు చేసింది. జిల్లా మార్కెటింగ్ అధికారి పీ.శ్రీనివాస్‌ను ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. నూతన కమిటీ ఏర్పాటయ్యే వరకూ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో కార్యాలయ నిర్వహణ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

షాదిఖానా భూ వివాదంపై ఆర్డీవో విచారణ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ షంషీర్‌నగర్ బస్తీలో ఉన్న షాదిఖానా భూ వివాదంపై మంగళవారం ఆర్డీవో హరికృష్ణ విచారణ చేశారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, తహసీల్దార్ సుధాకర్, సర్వేయర్ మణిరాజ్, ఆర్ఐ ఆదిలక్ష్మితో కలిసి షాదిఖానా వద్దకు వెళ్లగా ఇరు వర్గాల వాదనలు విన్నారు. వారి వద్ద ఉన్న భూ దస్త్రాలను ఆర్డీవో పరిశీలించారు. ఓ వర్గం శ్రేణులు తమ వద్ద ఉన్న భూ దస్త్రాలను చూపించగా ప్రభుత్వ భూమికి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉండవని, ఉన్నా అవి చెల్లుబాటు కావన్నారు. ఆ దస్త్రాలను రెవెన్యూ కార్యాలయంలో ఉన్న రికార్డుల ఆధారంగా పరిశీలిస్తామన్నారు. షాదిఖానాకు కేటాయించిన స్థలాన్ని గుర్తించి స్వాధీనం చేస్తామని, హద్దులు కూడా ఏర్పాటు చేస్తామని ఆర్డీవో స్పష్టం చేశారు.

'నిధులు వచ్చేలా చూడండి'

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు టీయూఎఫ్ఐడీసీ నుంచి మంజూరైన రూ.28 కోట్లు నిలిచిపోయాయని, వెంటనే మంజూరు చేయాలని కోరుతూ మున్సిపల్ చైర్ పర్సన్ అర్చన రాంలాల్‌గిల్డా ఆధ్వర్యంలో కలెక్టర్ బదావత్ సంతోశ్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు శ్రీనివాస్, అనిల్, శంకర్, మేడ సురేశ్‌రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.



రెండు హృదయాల కలయిక ప్రేమ

సృష్టిలో అనిర్వచనీయమైన భావన.. ప్రేమ. అది అనుభవించాలే గాని అర్థం చేసుకోవడం కష్టం. ప్రేమ ఎలా పుడుతుందో... ఎవరికీ అంతుపట్టదు. ఆకర్షణకన్నా అర్థం చేసుకునే పునాదులపై ఏర్పడిన ప్రేమ కలకాలం నిలబడుతుంది. అది నిస్వార్థమైన ప్రేమ. ఎన్నటికీ తరగని ప్రేమను తన హృదయంలో శాశ్వతంగా నిలుపుకుంటుంది. ప్రేమదాసులు దేవదాసులైనా... పెళ్లి తర్వాత ప్రేమలు ఫెయిల్యూర్ అయినా.. అసలైన ప్రేమ మాత్రం అజ రామరంగా నిలిచి వెలుగుతుంది. ఈ రోజు ప్రేమికుల దినోత్సవం. ప్రాణం తీసే ప్రేమలు కాదు, ప్రాణం పోసే ప్రేమలు వర్ధిల్లాలని మనసారా కోరుకుందాం.

'దివ్య'మైన ప్రేమ


రమ్యకృష్ణ, నర్సింహారావు

నెన్నెల: వారిద్దరి మధ్య మాటలు లేవు. అయినా 'మూగ' మనస్సుల మధ్య ప్రేమ చిగురించింది. మూడుముళ్ల బంధం వైపు నడిచింది. నెన్నెల మండలంలోని గంగారం గ్రామానికి చెందిన సెగ్యం రాజన్న–లక్ష్మి దంపతుల కుమార్తె రమ్యకృష్ణ, భద్రాచలంకు చెందిన నాగేశ్వర్‌రావు–తులసి దంపతుల కుమారుడు నర్సింహారావు ఇద్దరూ మూగవారే. హైదరాబాద్‌లోని మూగ కళాశాలలో డిగ్రీ వరకు కలిసి చదువుకున్నారు. అక్కడ ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల తల్లిదండ్రులను ఒప్పించి 2021 డిసెంబర్ 29న పెళ్లి చేసుకున్నారు.

ప్రేమికుల రోజే ప్రేమపెళ్లి


సాయిమూర్తి, మౌనిక

ప్రేమకు కులం, మతం లేదని, రెండు మనస్సులు, ఇద్దరి అభిప్రాయాలు ఒక్కటైతే చాలంటున్నారు నెన్నెల మండలానికి చెందిన ప్రేమికులు పోతరాజుల సాయిమూర్తి (కాపు), దుర్గం మౌనిక (నేతకాని). ఇద్దరూ నెన్నెల ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. ఇద్దరి మధ్య స్నేహం ఉండేది. ఆ స్నేహమే ప్రేమగా మారింది. ఆతర్వాత పెద్దలను ఒప్పించి 2022, ఫిబ్రవరి 14న కులాంతర వివాహం చేసుకున్నారు.

వాళ్లిద్దరూ ఒక్కటయ్యారు..


మానస, సాయికుమార్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని హన్మాన్‌బస్తీకి చెందిన పెద్దపల్లి మానస, పోస్టాఫీసు బస్తీకి చెందిన భుక్య సాయికుమార్ మధ్య 2009లో పరిచయం ఏర్పడింది. పీజీ పూర్తి చేసిన మానస మున్నూరుకాపు, డిగ్రీ చదువుకున్న సాయికుమార్‌ది లంబాడీ సామాజికవర్గం. కులాంతర వివాహానికి యువతి తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో పెద్దలను ఎదిరించి 2018, ఏప్రిల్ 21న వివాహం చేసుకున్నారు. సాయికుమార్ స్నేహితులు అండగా నిలబడి లక్సెట్టిపేటలోని టీటీడీ కళ్యాణ మండపంలో సంప్రదాయబద్ధంగా పెళ్లి జరిపించారు. ఆ తర్వాత ఇరు కుటుంబాలు కలిసిపోయాయి.

పెద్దలను ఒప్పించి...


డాక్టర్ వనజ-అజయ్‌కుమార్‌రెడ్డి

భైంసాటౌన్: భైంసా పట్టణానికి చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ వనజ, రేడియాలజిస్ట్ అజయ్‌కుమార్ రెడ్డిలు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. తమ ప్రేమ గురించి తెలిసి ఇరువురి కుటుంబాల్లో మొదట ఒప్పుకోలేదని, ఇరువైపులా పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నాం. ఆరో తరగతి వరకు కలిసి చదువుకున్నామని, వైద్య విద్య చదువుతున్న సమయంలో పరిచయం ప్రేమగా మారిందన్నారు. దీంతో ఇంట్లో పెద్దలకు విషయం చెప్పడంతో ఒప్పుకున్నారని చెప్పారు. ప్రస్తుతం ముగ్గురు పిల్లలతో తాము ఆనందంగా ఉన్నట్లు చెప్పుకొచ్చారు.

ప్రేమే ఉన్నతంగా తీర్చిదిద్దింది...


ఉదగిరి అనిత-రామకృష్ణ

నిర్మల్‌ఖిల్లా: ఉస్మానియా మెడికల్ కళాశాలలో 1995లో ఎంబీబీఎస్ వైద్య విద్య కోర్సు చదువుతున్నప్పుడు ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. మొదటగా అనితకు నా మనసులో మాట చెప్పాను. కొంత సమయం తీసుకుని ఓకే చెప్పింది. డాక్టర్లుగా స్థిరపడిన తర్వాతనే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. ఇరు కుటుంబాల పెద్దలు అడ్డుచెప్పారు. 2002లో వివాహం చేసుకున్నాం. ఇద్దరం నిర్మల్‌లోనే ప్రైవేట్ ఆస్పత్రిని నెలకొల్పాం. ఓ పాప, బాబుతో జీవితాన్ని సాఫీగా సాగిస్తున్నామని రామకృష్ణ తెలిపారు.

మతాలు వేరైనా ..


ఎస్.కె.ఇర్ఫాన్, అవని

తాంసి: మతాలు వేరైనప్పటికీ వారిని ప్రేమ ఒక్కటిచేసింది. ప్రేమకు మతాలు అడ్డు రావని మరోమారు నిరూపించింది ఈ యువ జంట. భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన ఎస్.కె.ఇర్ఫాన్, గంపల అవని ఒకే గ్రామానికి చెందిన ఇరువురికి చిన్నప్పటి నుంచే పరిచయం ఉంది. వీరి పరిచయం కాస్త ప్రేమగా మారింది. వీరి ప్రేమను పెద్దలు ఒప్పుకోలేదు. దీంతో పెద్దలను ఎదురించి వివాహం చేసుకున్నారు. వీరి ప్రేమకు గుర్తుగా ఏడాదిన్నర క్రితం బాబు జన్మించాడు. ప్రస్తుతం ఇరు కుటుంబ సభ్యులు సైతం వారి ప్రేమను అంగీకరించారు.

దూరం దగ్గర చేసింది...


అనుపమ-విజయానంద్

మాది ఆదిలాబాద్ జిల్లా.. నా భార్యది పెద్దపల్లి జిల్లా. మేము ఇద్దరం 2010లో హైదరాబాద్‌లో నర్సింగ్ కాలేజీలో చదువుతున్నప్పుడు ప్రేమ మొదలైంది. అప్పటి నుండి ఇద్దరు ఒకరిపై ఒకరికి ప్రేమ పెరిగి వివాహం చేసుకుందామనుకున్నాం. పెద్దలు ససేమిరా అన్నప్పటికీ ఇరుకుటుంబాలను ఒప్పించి 2016లో పెళ్లిం చేసుకున్నాం. మాకు కవలలు జన్మించారు. ప్రస్తుతం ఇద్దరు బాబులతో జీవితం ప్రశాంతంగా సాగుతోంది. ఇటీవల నాకు నర్సింగ్ ఆఫీసర్‌గా నిర్మల్ జిల్లా కేంద్ర ప్రధాన ఆస్పత్రిలో ఉద్యోగం వచ్చింది.

అర్థం చేసుకుని ముందుకెళ్లాలి



కౌటాల: జీవితంలో అన్ని అంశాలను అర్థం చేసుంటూ ముందుకెళ్లాలి. ప్రేమించడం నేరం కాదు. కానీ ప్రేమ అనేది అంధకారంలోకి నెట్టేదిగా ఉండొద్దు. ప్రస్తుతం ప్రేమ అనేది గత ప్రేమికుల మాదిరిగా నిజాయతీగా ఉండడం లేదు. కొందరి మధ్య ఉండే సాన్నిహిత్యాన్ని ప్రేమగా భావించడం తప్పు. చదువుకుని ఉన్నత స్థాయికి చేరితే మిగతావన్నీ దరిచేరుతాయి.

– పి. ప్రియ, డిగ్రీ విద్యార్థిని, కౌటాల

చదువుపై దృష్టి ఉండాలి



కౌటాల: ఆధునిక కాలంలో యువత చెడు వ్యసనాల బారిన పడేందుకు చేతిలో సెల్‌ఫోన్, డబ్బులు, సోషల్ మీడియా అందుబాటులో ఉంది. చదువు కోవడం ద్వారానే ఉన్నత స్థానాలకు చేరుకుంటాం. ఆ తర్వాత మన భవిష్యత్‌ను తల్లిదండ్రులే నిర్ణయిస్తారు. ప్రేమ వివాహమైనా తల్లిదండ్రుల ఇష్టంతో చేసుకుంటే బాగుంటుంది.

– టి.రాహుల్, డిగ్రీ విద్యార్థి, కౌటాల

వాళ్లకే బాగా తెలుసు..



కౌటాల: అందరి జీవితాల్లో ప్రేమ, పెళ్లి రెండూ ముఖ్యమే. చదువుకునే సమయాన ఇతర విషయాలపై దృష్టి సారించొద్దు. జీవితంలో స్థిరపడిన తర్వాత మనకేం చేయాలో, ఏమేం ఇవ్వాలో తల్లిదండ్రులకు తెలిసి ఉంటుంది.

– ఆర్.సుప్రియ, డిగ్రీ విద్యార్థిని, కౌటాల

ప్రేమ.. ఆకర్షణ..!

- అర్థంకాని వయసులో యువత ప్రేమ గోల..
- ఆకర్షణ వలలో చిక్కొద్దు.. భవిష్యత్ పాడు చేసుకోవద్దు
- పరస్పర అవగాహనతోనే బంగారు జీవితం
- నేడు ప్రేమికుల దినోత్సవం

మంచిర్యాలక్రైం: నేటి సమాజంలోని యువత తెలిసీ తెలియని వయస్సులో ప్రేమ మైకంలో పడి తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. ప్రేమ పేరుతో తొందరపాటులో పెళ్లి చేసుకుని అతి తక్కువ కాలంలో వారి జీవితాలను అంధకారం చేసుకుంటున్నారు. ప్రేమించి మోసం చేసాడని ఒకరు.. ప్రేమించి పెళ్లి చేసుకుని ఇప్పుడు వద్దంటున్నాడని మరొకరు.. ఇలాంటి సంఘటనలు నిత్యం చూస్తూనే ఉన్నాం. ప్రేమ మైకంలో చిక్కుకుని మోసపోతున్న నేటి యువతరంపై 'సాక్షి' కథనం.

మారుతున్న ఆలోచనలు

నిజం... నిజాయతీ.. నమ్మకం... ధైర్యం.. విజయం. ఈ ఐదు ప్రేమకు నిజమైన అర్థాలు. కానీ నేటి యువత ఆలోచనలు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రేమ అంటే వారి దృష్టిలో కళ్లల్లోకి కళ్లు పెట్టి చూసుకోవడం.. పబ్బులు..పార్కుల్లో తిరగడం అనుకుంటారు. ప్రియురాలు అడిగిన వెంటనే ఏదైనా కొనివ్వడం, సినిమాలకు తీసుకెళ్లడం, తన స్థోమతకు మించి తల్లిదండ్రులకు తెలియకుండా అప్పులు చేయడం వంటివి చేస్తుంటారు. చివరకు తల్లిదండ్రులకు అప్పులబాధతో పాటు కడుపుకోతకు కారణమవుతున్నారు. ప్రేమించడం తప్పు కాదు.. ప్రేమ మోజులో తప్పులు చేయడం ముప్పు.. ప్రేమికుడు ప్రియురాలికి ఇవ్వాల్సిన నిజమైన ప్రేమ ఆనందం. తల్లిదండ్రుల వద్ద గౌరవం ఉండేలా సమాజంలో గుర్తింపు, అనుకున్న లక్ష్యాన్ని సాధించి ఇరు కుటుంబాల్లో సంతోషాన్ని ఇవ్వడం, సమస్యలు వస్తే కృంగిపోకుండా ధైర్యంతో ముందుకెళ్లడం.

కొన్ని ఉదాహరణలు

- జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ప్రేమ పేరుతో మోసపోయి గత నెల 22న ఓ బాబుకు జన్మనిచ్చింది. సదరు యువకుడు సంబంధంలేదని చెప్పడంతో పోలీసులు అతనిపై ఫోక్సో కేసు నమోదు చేశారు.
- జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువతి, మందమర్రికి చెందిన ఓ యువకుడు ఏడాదిపాటు ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలని యువకునిపై ఒత్తిడి తేవడంతో నిరాకరించాడు. దీంతో యువతి పోలీసులను ఆశ్రయించడంతో పెళ్లికి అంగీకరించాడు. ఇద్దరి కులాలు వేరు కావడంతో యువకుడి తల్లిదండ్రులు పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో యువతి తల్లిదండ్రులు కొందరు పెద్దమనుషుల సమక్షంలో వివాహం జరిపించారు. రెండు రోజుల తర్వాత సదరు యువకుడు పారిపోవడంతో న్యాయం కోసం యువతి మళ్లీ పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతోంది.

తేడా తెలిసాకే ప్రేమించాలి



ముందు లైఫ్ సెటిల్ గురించి ఆలోచించండి. లైఫ్ సెటిల్ అయిన తర్వాత జీవిత భాగస్వామి గురించి ఆలోచించండి. ప్రేమించి పెళ్లి చేసుకున్న తర్వాత అనేక ఇబ్బందులు వస్తాయి. ఒకరినొకరు అర్థం చేసుకుని సమస్య పరిష్కరించుకోవాలి. నమ్మకం, ప్రేమ రోజురోజుకూ రెట్టింపవ్వాలి. జీవితమనేది కనిపించని టీచర్ లాంటిది. అది జీవితాంతం నీకు పాఠాలు నేర్పూతూనే ఉంటుంది. ప్రేమ, ఆకర్షణకు తేడా తేలుసుకున్నాకే ప్రేమించాలి.

– తిరుపతిరెడ్డి, ఏసీపీ, మంచిర్యాల

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి


మాట్లాడుతున్న జీఎం మనోహర్

మందమర్రిరూరల్: స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై అందిస్తున్న ఉచిత శిక్షణకు సింగరేణి పరిసర ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని ఏరియా జీఎం మనోహర్ కోరారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసక్తి కలవారు ఈ నెల 16లోగా(www. scclmines.com/apprenticeship) ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్నవారు రియాలోని గనుల వృత్తి శిక్షణ కేంద్రం (ఎంవీటీసీ)లో నేరుగా దరఖాస్తులు అందజేయాలన్నారు. సింగరేణి ఆర్డీఎస్‌డీఈ సహకారంతో ఎనిమిది కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను పరిగణలోకి తీసుకుని ముందుగా రెండు కోర్సులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒక్కో కోర్సు రెండు వారాల పాటు ఉంటుందని, బ్యాచ్‌కు 20 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎస్సెస్సీ, డిగ్రీ అర్హత ఉండి 18 నుంచి 42 సంవత్సరాల లోపువారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, అధికారులు మైత్రేయబంధు, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ స్టాఫ్‌కు సూటబుల్ జాబ్

శ్రీరాంపూర్: మైనింగ్ స్టాఫ్‌కు ఈ నెల 19న మెడికల్ టెస్టు నిర్వహించి సూటబుల్ జాబ్ ఇవ్వనున్నారని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణిలో 2011కు ముందు మైనింగ్ స్టాఫ్/టెక్నికల్ సూపర్‌వైజర్లకు అనారోగ్యంతో అండర్‌గ్రౌండ్‌లో అన్‌ఫిట్ అయితే వారికి సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇచ్చారని, ఆ తర్వాత పదేళ్లుగా పూర్తిగా నిలిపివేశారన్నారు. దీనిపై తాము యాజమాన్యంతో చర్చించిన పిమ్మట 2011 నుంచి సుటబుల్ జాబ్ రాక పెండింగ్‌లో ఉన్నవారు, జనరల్ మజ్దూర్లుగా నియమించబడ్డ వారికి మెడికల్ టెస్టు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మైనింగ్ స్టాఫ్ హర్షం..

మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ రీజియన్ కార్యదర్శి వంగరి రాజేశ్వర్‌రావు, బాపు, సత్యనారాయణ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

'సమ్మెకు దూరంగా ఉండాలి'

శ్రీరాంపూర్: ఈనెల 16న దేశవ్యాప్తంగా యూనియన్లు పిలుపునిచ్చిన సమ్మెకు సింగరేణి కార్మికులు దూరంగా ఉండాలని యజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సమ్మె డిమాండ్లలో సింగరేణి సమస్యలు లేవన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న డిమాండ్లకు సింగరేణికి సంబంధం లేదన్నారు. కావున ఉద్యోగులు సమ్మెలో పాల్గొనకుండా సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలకు కోసం విధులకు హాజరు కావాలని సూచించారు.

మందమర్రిరూరల్(చెన్నూర్): ఈ నెల 16న జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ఒక్కరోజు సమ్మెకు సింగరేణి కార్మికులు దూరంగా ఉండాలని ఏరియా జీఎం మనోహర్ కోరారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్క రోజు సమ్మె చేస్తే సింగరేణి వ్యాప్తంగా సుమారు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతుందన్నారు.

నేడు వసంత పంచమి

- బాసర ఆలయంలో ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి
- భారీగా తరలిరానున్న భక్తులు


గోదావరినది వద్ద హారతిఘాట్‌లో భక్తులు


బాసర ఆలయంలో భక్తులు

భైంసా(ముధోల్): సరస్వతీ అమ్మవారి జన్మదినోత్సవమైన వసంత పంచమి ఉత్సవానికి బాసర ఆలయం ముస్తాబైంది. బుధవారం బాసరలో వసంత పంచమి వేడుక జరగనుంది. ఏటా మాఘ శుద్ధ పంచమి రోజున నిర్వహించనున్న ఈ వేడుకకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి దర్శనానికి మనరాష్ట్రంతో పాటు దక్షిణ, ఉత్తర భారత రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్నారు. భక్తులకు సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు. అశేష జనవాహినికి సరిపడే ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రసాదాల కౌంటర్లు, తాగునీరు, వైద్య సదుపాయాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. క్యూలైన్‌లలో చిన్నారులకు పాలు, బిస్కెట్లు అందించనున్నారు. ప్రత్యేక అక్షరాభ్యాసం మండపాలు ముస్తాబయ్యాయి. సుమారు 70వేల మంది వరకు భక్తులు తరలివస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రసాదాల కొరత రానీయకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భక్తులకు నిరంతర అన్నదానం నిర్వహించనున్నారు.

ప్రత్యేకత, పూజలు

చదువుల తల్లి జన్మదినం సందర్భంగా మాత సన్నిధిలో అక్షర శ్రీకారం నిర్వహించుకుంటే తమ చిన్నారులు ఉన్నత విద్యావంతులు అవుతారని భక్తుల నమ్మకం. అందుకే ఏటా వందలాది మంది చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు జరుగుతాయి. ఉత్సవం సందర్భంగా బుధవారం వేకువజామున రెండు గంటలకు మంగళ వాయిద్య సేవ, సుప్రభాత సేవలతో ఉత్సవం ప్రారంభమవుతుంది. రెండున్నర గంటల నుంచి అమ్మవారికి మహాభిషేకం, అలంకరణ, నివేదన నిర్వహిస్తారు. అనంతరం అక్షరాభ్యాస, కుంకుమార్చన పూజలు ప్రారంభమవుతాయి. సాయంత్రం ఏడు గంటలకు అమ్మవారికి పల్లకి సేవ నిర్వహిస్తారు.

భారీ బందోబస్తు...

ఉత్సవంలో ఎలాంటి అపశ్రుతులు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఆలయం, గోదావరి స్నాన ఘట్టాలు, పార్కింగ్ స్థలాల వద్ద అదనపు భద్రతా చర్యలు చేపట్టనున్నట్లు బాసర ఎస్సై గణేశ్ తెలిపారు. ఆలయ ప్రధాన ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలతో నిఘా వేయనున్నట్లు సీఐ తెలిపారు.

తరలివస్తున్న భక్తజనం...

వసంత పంచమి వేడుకల్లో పాల్గొనేందుకు మంగళవారం సాయంత్రం నుంచే భక్తులు బాసరకు తరలివస్తున్నారు. సాయంత్రానికి ఆలయ అతిథి గృహాలు, ప్రైవేటు లాడ్జీలు భక్తులతో నిండిపోయాయి. బాసర వచ్చే బస్సులు, రైళ్లు భక్తులతో కిటకిటలాడాయి. ప్రైవేటు లాడ్జీలన్నీ నెల రోజుల క్రితమే బుకింగ్ కావడంతో చాలా మంది భక్తులు బయటే ఉండిపోయారు. బాసర వచ్చే భక్తులకు నిత్య అన్నదానం నిరంతరాయంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈఓ విజయరామారావు తెలిపారు. బాసర ఆలయం విద్యుత్‌కాంతుల్లో శోభాయమానంగా కనిపిస్తుంది. ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలు అమర్చారు. ఆలయంలో ఎటుచూసినా భక్తులే కనిపిస్తున్నారు.

ప్రత్యేక పూజలు...

మంగళవారం ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో సరస్వతీ నామాలు, సరస్వతీ మాత అనుష్టానం, జపం, పారాయణంచేశారు. అమ్మవారి విశిష్టతను భక్తులకు వివరిస్తున్నారు.

స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా ప్రభుత్వ ఆంగ్ల భాష ఉపాధ్యాయుల సంఘం (ఎల్టా) ఆధ్వర్యంలో స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలో చదువుతున్న 8, 9 తరగతుల విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో స్పెల్ విజార్డ్ స్ట్రీమ్–1లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్గనూర్‌కు చెందిన వైష్ణవి, స్ట్రీట్–2లో తెలంగాణ మోడల్ స్కూల్ మంచిర్యాలకు చెందిన సంజన, డ్రామా విభాగంలో స్ట్రీమ్–1లో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన సాయి వైష్ణవి బృందం, స్ట్రీమ్–2లో కేజీబీవీ మంచిర్యాలకు చెందిన మణి, సన బృంద సభ్యులు అత్యంత ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. సదరు విద్యార్థులను డీఈవో యాదయ్య సన్మానించారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి సత్యనారాయణమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఎల్టా సభ్యులు బాబ్జీ, సత్తయ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.